# సారంగం

● తురగా జానకీరాణి ● చిత్రాలు: భాస్కరన్

నన్ను సీతారాంపురానికి బదిలీ చేశారు. ఏ ఊరైతేనేం, వెళ్ళిపోవలసిందేగా! ఆరేళ్ళ సర్వీసు నాకిప్పటికి ఈ డిపార్టుమెంటులో. కొండకానీ, వాగుకానీ, గుట్టకానీ భయపడలేదు. బస్సు దిగి మూడు కిలోమీటర్లు నడవాలన్నారు ఈ గ్రామానికి. ఫర్వాలేదు. ఉత్తమ సేవికగా బహుమతి కూడా తెచ్చుకున్నాను. ఇంటికి వెళ్ళి, నాకిల్లా ట్రాన్స్‌ఫర్ అయిందని చెప్పి, నాలుగు బట్టలు, బ్యాగు తీసుకుని బస్సు ఎక్కాను. రోడ్డు మీద ఆ బస్సు దిగి, బోర్డు పరిశీలించాను. 'సీతారాంపురం' తెల్లబోర్డు మీద నల్ల అక్షరాలు. వంతులమ్మ అన్నట్లు నన్ను కొందరు చూశారు చిన్న హొటలు దగ్గర ఉన్నవాళ్ళు. పొద్దున్న పదిగంటల ఎండ వేడిగా మాడ్చేస్తోంది. గొడుగు వేసుకుని, సంచీ భుజాన తగిలించుకుని వేగమైన నడక సాగించాను. అర కిలోమీటరు వరకు నడిచాక వెనుక నుంచి చప్పుట్లు వినిపించాయి. తిరిగి చూస్తే 'కచ్చురం' బండి మనిషి పిలుస్తున్నాడు. కొన్త ఆయాసం కూడా వచ్చిందేమో, నిలబడ్డాను. కచ్చురం వచ్చి నా పక్కన ఆగింది. అందులోంచి ఒకావిడ - ముప్పై ఏళ్ళు ఉండవచ్చును - నన్ను పిలిచింది.

"సీతారాంపురం పోతున్నారా? రాండ్రి" అని ఆహ్వానించింది. చిన్న బండి కానీ, ఇద్దరు, ముగ్గురు బాగానే కూర్చోవచ్చును. ఎక్కాను. "నమస్తే అమ్మా! కొత్తగా బదిలీ అయి వస్తున్నా. మనూరి సేవికను. శారదాంబ నా పేరు" అని పరిచయం చేసుకున్నాను. ఆమె చిన్నగా నవ్వి, "అట్లనా! శారద అని చెప్పరాదూ? శారదాంబ అంటే ఏదో పెద్దగ అయినట్లుంటది" అన్నది. నన్ను కాసేపు పరిశీలించాక "ఊర్లనే ఉంటవ, దినమూ పోయొస్తవ?" అన్నది మళ్ళీ.

"ఉంటా. పోయిరాను చేతకాదు" అన్నాను. అట్లా ప్రారంభమైంది సుగుణమ్మ గారితో నా పరిచయం. వారింట్లోనే గది ఇచ్చారు. సుగుణమ్మ ఎనిమిది చదివింది. ఆమె భర్త రామారావు ఏనాడో ఇంటర్ పాసై విద్యావంతుడైన పెద్ద రైతుగా వ్యవసాయం చేస్తున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. మంజుల తొమ్మిదో తరగతి, అబ్బాయి సురేష్ ఎనిమిదో తరగతి. ఇద్దరూ ఊరికి ఒక కిలోమీటరున్న జిల్లా పరిషత్తు స్కూలుకి పోయి వస్తున్నారు.

నేను ఆదివారంనాడు వెళ్ళి సామాను తెచ్చుకున్నాను. వంట మొదలు పెట్టుకుని నా గ్రామాల సంచారం పనిలో పడ్డాను. సుగుణమ్మగారు చనువుగానే ఉండేది కానీ, మరీ స్నేహంగా మసిలేది కాదు. నా గది తలుపు వేసుకుని నేను ఉంటే, వచ్చి పిలవడంగానీ, ఇంట్లో వండినవి ఇవ్వడంగానీ చేసేది కాదు.

ఒక రోజు వాళ్ళ ఇంట్లో ఏదో గొడవైంది. నాకు అర్థం కాలేదు అది ఎందుకైందీ. కానీ, ఒక గంట తర్వాత బావి దగ్గర నీళ్ళు తోడుకుందామని వెళ్ళేటప్పటికి అక్కడ సురేష్ ఏడుస్తూ కనపడ్డాడు. నేను బక్కెట్టు వదిలేసి



ఉత్తమ సంఘ సేవికగా
బహుమతి తెచ్చుకున్నాను.
కొత్త ఊరికి బదలీ అయ్యాను.

"ఏం సురేషూ! ఏమైంది?" అని భుజం మీద చేయి వేశాను. ఆ అబ్బాయి చెంపలు వాచిపోయి ఉన్నాయి. ఎంతో అభిమానంగా కళ్ళు తుడుచుకుని "ఏం లే" అన్నాడు. కానీ, ఏడుపు ఉబికి వస్తోంది. "నాతో చెప్పవా? నేను నీకు దోస్తును కదా" అన్నాను. వచ్చే ఏడుపు ఆపుకుంటూ, "అమ్మ కొట్టింది" అన్నాడు. నేను ఆశ్చర్యపోయాను.

"ఎందుకు?" అన్నాను. "స్కూలు దగ్గర దుకాణంల 'చాయ్' తాగినానని కొట్టింది. నాతాన పైసలు లేకుండె. మనూరి పిల్లగాని దగ్గర తీస్కొని తాగిన" అన్నాడు. నాకు ఏమనాలో తెలియలేదు. "పోనీ ఆమె వద్దంటే ఎందుకు తాగుతావు? ఇంటికి పోయినాక తాగితే ఏం పోయే?" అన్నాను. సురేష్ తల వంచుకున్నాడు. "ఇంట్ల నాకు చాయ్ ఇవ్వరు" అన్నాడు. "నేను ఇస్తాలేగానీ ఏడ్వకు" అని ఓదార్చాను.

హైస్కూలులో ఉన్న ఆ పిల్లవాడికి టీ ఇవ్వరు. డబ్బులు ఇవ్వరు. పతంగీ కొనాలన్నా సరే సరిపడే చిల్లర ఇచ్చి, మిగిలినవి లెక్కపెట్టి తీసుకుంటారు. చొక్కాలు చిన్నవైనాగానీ అవే కుట్లు విప్పి వేసుకోవాలి. ఆడపిల్ల మంజులకీ అంతే. స్కూల్లో అందరూ రకరకాల గాజులు, రిబ్బన్లు వేసుకొస్తారు. ఆమెకి మాత్రం ఉన్న గాజులు పగిలిపోతేనే కొత్తవి. నాకు ఈ పద్ధతి అసలు అర్థమయ్యేది కాదు. రెండు మూడు రోజులకొకసారైనా స్వతంత్రించి ఏదో చేసినందుకు మంజుల మీద కేకలు, సురేష్‌కి ప్రత్యక్షంగా దెబ్బలు. ఈ గోలంతా నాకు తెలుస్తూనే ఉండేది.

ఒకనాడు పనిగట్టుకుని పిల్లలు లేని సమయంలో సుగుణమ్మగారింట్లోకి వెళ్ళాను అద్దె ఇవ్వడానికి. ఎప్పుడైనా చేసిన మంచి ఫలహారం ఇవ్వడానికి మాత్రమే వెళ్ళేదాన్ని. అందువల్ల అంత చొరవగా వెళ్ళి కూర్చోడమూ తక్కువే. ఏవో కుశలప్రశ్నలైనాక —

"సుగుణమ్మగారూ! మీరు చదువుకున్నవారు. పిల్లలంటే ఎంతో ప్రేమ. చక్కగా అమ్మాయిని కూడా చదివిస్తున్నారు. కానీ, ఒక్కమాట అడిగితే మీకు కోపం రాదు కదా!" అన్నాను. ఆమె తల ఊపింది.

"పిల్లలకి కొంత వయస్సు వచ్చాక వాళ్ళని స్నేహితులలాగా చూడాలండీ. వాళ్ళకి చిన్న సరదాలుంటాయి. మీకు డబ్బున్నది కదా! వాళ్ళు అడిగినవి కొని ఇవ్వాలి. లేకపోతే వాళ్ళకి తోటి పిల్లల మధ్య చిన్నతనంగా ఉంటుంది" అన్నాను.

ఆమె కొంచెం ముఖం చిట్లించింది. "ఇప్పుడు నేను ఆళ్ళకి ఇయ్యనిదేంటి? మీతో చెప్పిన్రా? ముప్పొద్దులా తింటున్రు. పండగ పండగకి బట్టలాయె! ఏం తక్కువైంది శారదమ్మా? నీకాడికి వచ్చి ఏడ్చిన్రా ఏంది?" అన్నది.

నాకు ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ఎట్లా

చెబుతాను? - టీ నీళ్ళు తాగినందుకు కొట్టారు. గాజులు అడిగినందుకు తిట్టారు అని ప్రశ్న వేస్తే ఆ పిల్లల మీద విరుచుకుపడుతుందేమో!

"అట్లా కాదమ్మా! మీ బిడ్డలకి మీరు ఇవ్వరని ఎట్లా అంటాగానీ, వాళ్ళు నంతోషంగా ఉండేందుకు నాలుగు పైసలు ఎక్కువ ఖర్చుపెట్టినాగానీ ఏం కాదు. నేను తప్పుమాట అంటే ఏమీ అనుకోకండి" అన్నాను. "బాగా నదివిందానవు. నర్కారు ఆఫీసరువి. నీవు తప్పు మాట ఎందుకంటవులేగానీ, పిల్లలను అదుపులో ఉంచాల. ఇయ్యాల కష్టపడితే, రేపు సుకపడతరు. తాతలనాడు మనోల్లు బాగా కూడబెడితే, ఇవ్వటికి ఈ బురుజు నిలిసింది. నాకంటె, ఆల్ల నాయన కంటె బాగా పిల్లలు నదవాల్నేనే మేమూ ఆశపడుతున్నాం. ఎరికెనా?" అన్నదామె. నా నోటికి తాళం పడింది.

మరో ఏడాదికి మంజుల వది పాసైంది. ఆమెను ఇంటి దగ్గరే ఉంచి కుట్లూ అల్లికలూ నేర్పించారు. అందంగా, ఆకర్షణీయంగా తయారైంది ఆ పిల్ల. నేను నా హద్దుల్లో ఉంటూ, వారు చెప్పినదానికంటే మరో ఐదు రూపాయలు అద్దె ఎక్కువిస్తున్నందువల్లనో ఏమో గానీ - భార్యాభర్తలు నాతో మంచిగానే ఉండేవారు. మంజుల నా వాటాలోకి వచ్చి కాసేపు రేడియో వింటూ, వారపత్రికలూ అవీ చదువుతూ ఉండేది.

"మంజులా! మీ వాళ్ళు నిన్ను కాలేజీకి పంపిస్తారా?" అన్నాను. మొదట్లో కళ్ళు పెద్దవి చేసి 'కాలేజీయే?' అన్నది కానీ, ఆ తర్వాత తనూ ఆలోచించడం మొదలు పెట్టింది. ఒక రోజు శుభవార్త చెప్పనే చెప్పింది. నురేష్‌కి కూడా ఈ ఏడాది వది పూర్తి కాగానే ఇద్దర్నీ పట్నంలో పెట్టి చదివిస్తారుట. ఈ ఊరివాళ్ళు కొందరు అలా చదువుతున్నారు. నాకు చాలా నంతోషం అనిపించింది.

ఆ ఊరు వచ్చి మూడేళ్ళు దాటుతుండగా, నాకు మళ్ళీ ట్రాన్స్‌ఫర్ అయింది. నేను వెళ్ళిపోతున్నానంటే నుగుణమ్మ చాలా బాధపడింది. పిల్లలు నన్ను వదలలేక కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. నా కిది మామూలే. ఆమె దగ్గర సెలవు తీసుకుంటూ - 'నేను మీతో ఏదైనా కాని మాట అని ఉంటే ఏమీ అనుకోవద్దు - ఒక మాట. వాళ్ళు కాలేజీకి వెళ్ళే పిల్లలు కదా! అవనరమైనవన్నీ ఇవ్వండి. చిన్నపిల్లలు కొత్త ఊళ్ళో ఇబ్బంది పడవద్దు కదా!' అన్నాను.

రామారావు నవ్వాడు. "ఏంది శారదమ్మా! మళ్ళ ఈపాలి నువ్వొచ్చేతలికి నా బిడ్డలు ఎట్ల ఉంటరో సూడు. ఈ ఊర్లనయితే ఎట్లగైన నడిసిందిగానీ, పట్నంలో స్టయిలుగా ఉంచాల కద!" అన్నాడు. నేనూ నవ్వాను ఆ మాటల్లోని గర్వానికి.

నేను మరో ఊళ్ళో ఉంటూ ఒక రోజు పట్నం వెళ్ళాను, ఆఫీను వనిమీద. పొద్దున్న ఏదో కొంచెం తిని బయలుదేరానేమో ఆకలనిపించి, దగ్గర్లోని హొటలుకి వెళ్ళాను. టిఫిను తింటోంటే 'మేడమ్!' అంటూ నా పక్కన వచ్చి నిలబడింది ఆ అమ్మాయి - మంజుల. ఆమె వేషం, గలగలా నవ్వు కొత్తగా ఉంది. వెనుకనే నురేష్ వచ్చాడు. ఎంతో ఆధునికంగా ప్యాంటు, లోపల షర్టు, చేతిలో విలానంగా నల్ల కళ్ళజోడు. వక్కన ఇంకా ఇద్దరు అబ్బాయిలు. వాళ్ళు మునుపటి వారు కాదు. ఆ చిన్నపల్లెలోని నుగుణమ్మ పిల్లలేనా వీరు అనిపించింది.

గబగబా తినడం ముగించి, కాఫీ వద్దని చెప్పి, వాళ్ళతో కలసి బయటకు వచ్చాను. ఒక గది తీసుకుని హొటల్ కారియరు తెప్పించుకుని తింటున్నారుట.

"ఏంటి మేడమ్! అలా చూస్తున్నారు? ఇది వరకులాగ లేమా మేము?" అన్నది మంజుల. "ఔను అక్కా! కురచ లాగూ, చొక్కా వేసుకో లేదుగా నేను!" అన్నాడు నురేష్. నాకెందుకో నురేష్‌ని చూస్తే నంతోషం పొంగుకుని రాలేదు.

పిల్లలకి చిన్న చిన్న సరదాలుంటాయి. వాళ్ళు అడిగినవి కొని ఇవ్వాలి. లేకపోతే తోటివాళ్ళ మధ్య వారికి చిన్నతనం.



తెలివిగా, చురుకుగా ఉన్న విద్యార్థి లక్షణం స్ఫుటంగా లేదు. మధ్య మధ్య సిగరెట్లు కాలుస్తూ, పౌడర్లు, క్రీములు బాగా పట్టిస్తూ, క్రాపు నలిగితే ప్రమాదం అన్నట్లుగా - విపరీతమైన నాగరికతలో ఉన్నాడు.

"మంజూ! డబ్బుకి ఏమీ ఇబ్బంది లేదు కదా!" అన్నాను 'మీ అమ్మ, నాన్న పిసినారితనం మర్చిపోయారా?' అని అడగడానికి బదులుగా.

"లేనే లేదు మేడం! వద్దంటే డబ్బు అన్నట్లుంది. మీరు ఊరు రండి. అమ్మ మిమ్మల్ని ఎప్పటికీ యాద్ చేస్తూనే ఉంటుంది" అన్నది మంజుల. మరి కాస్సేపు బయట నిలబడే మాట్లాడుకున్నాము. వేసవి సెలవుల్లో ఒక వారం సెలవు పెట్టి వచ్చేటట్లు మాట ఇచ్చాను. వారు ఒకవేపు, నేను మరోవేపు వెడుతోంటే, హొటల్లోంచి వచ్చిన మగపిల్లలు కలవడం చూశాను. నాకు వారు వెనక్కి తిరిగి మళ్ళీ చేయి ఊపుతోంటే నేనొక విలేజి లెవెల్ వర్కరునే వారి దృష్టిలో అని చివుక్కుమనే ఆలోచన కలిగింది.

వేసవికాలంలో నాకు ఆఫీసులో ఏదో చికాకు వచ్చింది. అక్కడ ఉండ బుద్ధి కాలేదు. నుగుణమ్మ గారి ఊరు వెడితేనో అనుకున్నాను. అక్కడ బాగా ఉంటే నాలుగు రోజులు ఉందాం, లేకపోతే తిరుగు బస్సులో వద్దాం అని నిశ్చయించుకుని బయలుదేరాను.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు చేరుకున్నాను. నుగుణమ్మగారు ముందు సావిట్లోనే ఉంది. పలుకరించి మంచినీళ్ళు ఇచ్చింది. "ఏం శారదమ్మా! ఎక్కడికెల్లి వచ్చినారు?" అన్నది. నేను నా ప్రయాణాల గురించి చెప్పాను.

"మంజుల, నురేష్ లేరా?" అన్నాను. గదివేపు చూపించి "ఆమె ఉంది. నురేష్ నిన్నను పట్నం పోయిండు. ఇంకా రాలే" అన్నది.

వంట సావిట్లోకి వెడుతూ, "భోంచేద్దువు రా" అన్నది. కానీ, నేను ఆమెను అనునరించి వెళ్ళకుండా రూము తలుపు తీసి లోపలకు వెళ్ళాను. మంజుల మంచం మీద పడుకుని ఏదో చదువుకుంటోంది. మంచం మీద ఉన్న పత్రికలు, మామూలుగా నాకు కంపరమెత్తించే బొమ్మలు, కథలతో నిండి ఉండే రకానివి. అల్లాంటివే నవలలు కూడా పడేసి ఉన్నాయి.

ఆమె లేచి కూర్చుంది. "శారదా మేడం! నేను పిలిసినానని వచ్చేసినారు!" అన్నది. మీ రిజల్ట్సు వచ్చాయిగా, ఇంక ఏం చేద్దామను కుంటున్నావు?" అన్నాను. మంజుల తల వంచుకుంది. "పరీక్షలు పోయినాయి" అన్నది.

"ఎందుకు? ఎందుకెందుకు?" అన్నాను.

"పేపర్లు చాలా హార్డు. చాలామంది ఫెయిలైనారు" అన్నది. చాలామంది ఫెయిలయితే అది వాళ్ళ కర్మం - కానీ, మీరెందుకు చదువుకోలేదు అని గట్టిగా కేకలేయాలని నాకు అనిపించింది. "ఇద్దరూనా" అన్నాను. ఆమె తల ఊపింది.

"నురేష్ పట్నం ఎందుకెళ్ళాడు?" అన్నాను. ఏమో అన్నట్లు భుజాలెగరేసి, పెదవి కదిపింది. మంచం మీద పుస్తకాలన్నీ చేత్తో ఒకపక్కకు తోసి "మంజూ, ఇవన్నీ ఎందుకు చదువుతున్నావు?" అన్నాను. "బోర్ కొడుతోంటే ఏం చేయాల?" అన్నది. మరో ప్రశ్న నేను వేస్తే, నీకెందుకు అని వినుక్కోవచ్చును.

భోజనం చేస్తూ అడిగాను, "నుగుణమ్మ గారూ! పిల్లలు ఇద్దరికీ పరీక్షలు ఎందుకు పోయినాయి?" అని.

ఆమె కళ్ళార్పకుండా, పెరట్లోని చెట్లవంక అర్థం లేనట్లు చూస్తోంది. "నదవనిదే ఎట్ల పాసైతరు? నువ్వు సెప్పినవు కదా పైసలు మస్తు ఇవ్వాలని! ఇచ్చినం. అడిగిన బట్టలు, డ్రెస్సులు, ఫీజులు అన్నీ ఇచ్చినం. గడియారాలు, కళ్ళద్దాలు, బెల్టులు, బూట్లు, చిన్న రేడియో - అన్నీ వాళ్ళ నాయన కొనిపెట్టిండు. ఇరవై ఆరువేలు కర్చు అయినయి. ఇద్దరికీ నదువు

మాత్రం రాలే!" అన్నది సుగుణమ్మ.

అది అమాయకంగా అంటున్న మాట కాదు. లోపల రగులుతోంటే పైకి వచ్చిన సెగలు.

"మళ్ళీ ఇప్పుడు పరీక్షకు చదువుతారా?" అన్నాను నేను చాలా మెల్లిగా. నాకు ధైర్యం చాలడం లేదు. నువ్వే గద ఇమ్మన్నావు పైసలు అని నిలదీస్తోంది.

"ఇంక చదువు బంద్! మంజులకి పెళ్ళి చేస్తాం" అన్నది. భోజనం ముగించాక నాకింక నిజంగా వెళ్ళిపోవాలనిపించింది. "సురేష్‌ని చూసి పోదామనుకుంటున్నా సుగుణమ్మా!" అన్నాను.

"ఆయన వస్తేకదా. నువ్వు చూసేది!" అన్నది. నా గుండె గబగబ కొట్టుకుంది. అసలు ఏం జరిగిందో పగలబడి చెప్పదేం?

"రాక ఎక్కడికి పోతాడు? పట్నంలో ట్యూషన్ చదువుతున్నాడా" అన్నాను. అప్పుడు సుగుణమ్మ నా వంక చూసిన చూపు, సంగనాచిలా ఏమిటి అడుగుతున్నావు అనే ఈసడింపుగా ఉందా? - మా బతుకు నవ్వులపాలు చేసింది నువ్వేగా అని సాధిస్తున్నట్లుగా ఉందా? - అర్థం కాలేదు కానీ, నేను ఇరుకులో పడిపోతున్నాను.

"శారదమ్మా! సదువు లేకపోయినా, ఆ పిల్లగాడికింత బుద్ధయిన ఉంటుండి. ఇరవై ఆరువేలు కరుసు పెట్టి ఆయన, ఆమె ఎన్నో కొనుక్కున్నరు శారదమ్మా! నప్పుడు సేయక మంజులకు పెండ్లిచేసి తోలిస్తున్నాం. సురేశ సంగతి...." అని పైకి చూపింది- ఆ పరమాత్ముడికే ఎరుక అన్నట్లు.

రామారావుగారు వచ్చారు బయట నుంచి. "సురేష్ రాలే?" అని మొదట ప్రశ్న అడిగి, ఆ తరువాతనే నన్ను పలుకరించాడు. నేను కూడా ఊరి విషయాలు ఏవో అడిగాను. వాళ్ళు చెప్పారు. మంజుల గదిలోంచి ఇవతలకు రాలేదు. నేనే ఆమె రూములోకి మళ్ళీ వెళ్ళాను. కిటికీ దగ్గర కాస్త వెలుతురు మినహా మిగతా అంతా చీకటిగానే ఉంది. లైటు వేశాను.

"నేను భోంచేస్తోంటే నువ్వొచ్చి నా పక్కన కూచుంటావనుకున్నాను, మంజులా!" అన్నాను.

"ఈ కథ పూర్తి చేసినాక వద్దామని - అప్పుడే అయిపోయిందా భోజనం?" అన్నది. నేను మంచం మీద కూర్చున్నాను. నీకు పెళ్ళి చేస్తారుట కదా అని అడగాలని ఉంది. కానీ, ఆమె తాబేలు లాగ తల లోపలకు దాచుకుంటున్నట్లు ఉన్నది. తన విషయంగానీ, సురేష్ విషయంగానీ మాట్లాడ్డం కష్టంగా ఉంటుందేమో అనుకుని, అర్థం లేని మాటలు ఏవో ఆరంభించాను, చీరలు, డ్రెస్సులు, సినిమాల గురించి.

ఆ తర్వాత బయలుదేరి నేను ఊళ్ళోకి వెళ్ళాను. గుమ్మం వరకు వచ్చింది సుగుణమ్మ. "రాత్రి సీకట్లో పోమాకు శారదాంబా! పొద్దున్న పోదువు" అన్నది నాతో. అప్పటికి మంజుల కూడా కాస్త సర్దుకుంది. "శారదమ్మ ఐదు రోజులు ఉంటానని చెప్పింది. జాకెట్టు కత్తిరింపులు నేర్వాలి. స్వెట్టరు పూర్తి చేయాలి. ఆమె ఇయ్యాల ఏడ పోతది?" అన్నది. కులాసాగా నవ్వి బయటకు నడిచాను.



సురేష్ మత్తుమందులు అలవర్చుకొన్నాడు. విషపురుగు కాటు రోజూ తింటున్నాడు.

ఊళ్ళో నాకున్న మిత్రులతో మాట్లాడినప్పుడు అసలు సంగతి తెలిసింది. డబ్బు పుష్కలంగా అందుకున్న అక్క, తమ్ముడు పాడు అలవాట్లు చాలా నేర్చుకున్నారు. మంజుల ప్రేమలో పడింది. సురేష్ సిగరెట్లతో పాటు ఇతర మందులు కూడా అలవర్చుకున్నాడు. ఎంత డబ్బూ చాలలేదు. ఈ విషయాలు తల్లితండ్రులు గ్రహించేసరికి ఆ పిల్లలిద్దరి చదువులు సర్వనాశనమైనాయి.

సురేష్ పూర్తిగా చేయిదాటిపోయాడు. రామారావు చాలా కోపదారి మనిషి. సుగుణమ్మ కూడా కరుకు మనిషే. ఆడపిల్ల అని గారాబం చేయక, మంజులని చావగొట్టి చెవులు మెలేసి తీసుకొచ్చారు. నాలుగు లక్షల కట్నం బేరమాడి, బొంబాయిలో ఉన్న దూరం చుట్టాలబ్బాయితో పెళ్ళి కుదురుస్తున్నారు. సురేష్ మొండిబారిపోయాడు. ఎక్కడి డబ్బూ చాలడం లేదు.

ఇవన్నీ విని నా బుర్ర తిరిగిపోయింది. మనసులో భగభగమనే పశ్చాత్తాపం. స్వేచ్ఛ ఇస్తే పిల్లలు ఇలా పాడైపోతారా? డబ్బులు పంపడమే కానీ, వాళ్ళేం చేస్తున్నారో, ఎవరి సావాసంలో ఉన్నారో గమనించవద్దా పెద్దవాళ్ళు? పరిస్థితి మించిపోయేదాకా ఎందుకు ఊరుకున్నారు? ఇప్పుడైనా ఆ పిల్లవాడిని దారిలో పెట్టేందుకు సరైన పద్ధతి ఏమిటో ఎందుకు ఆలోచించడం లేదు?

ఎవరో టీ ఇవ్వబోతే కూడా వద్దని వచ్చేశాను. ఈ కబుర్లన్నీ నాకు చెప్పిన వాళ్ళు మంచి సినిమా కథలాగ వర్ణించి వర్ణించి మరీ చెప్పారు. వినగానే నాకు జ్వరమంత ఆవేశం కలిగింది.

కాళ్ళీడ్చుకుంటూ చీకటిపడే సమయానికి సుగుణమ్మ ఇంటికి చేరాను. దీపాలన్నీ వెలుగుతున్నాయి. ఎనిమిది వరకు పెరట్లో కోసిన పువ్వులు మాలలు కడుతూ మంజుల అడిగిన జాకెట్లు కత్తిరించి ఇచ్చాను.

నేను, మంజుల అన్నం తిని రూములోకి వెళ్ళాం. సుగుణమ్మ వాళ్ళాయన వచ్చే వరకు ఉంటానంది. సురేష్ గురించి ఎవ్వరూ ఏమీ అనడం లేదు. పదకొండు వరకు కుట్టుపనులు జరుగుతూనే ఉన్నాయి. ఆ పనిలో పూర్తిగా మునిగి పోయింది మంజుల. కాబోయే పెళ్ళికొడుకు నీకిష్టమేనా అని అడగాలన్నా భయమే. నాకు ఎప్పటికీ నిద్రపట్టలేదు. ఎప్పటికో కాస్త కునుకు పట్టినట్లుంది. అంతే, కాస్సేపటికే మెలకువ వచ్చింది. రామారావు అరుస్తున్నాడు, సుగుణమ్మ అరుస్తోంది. పెద్ద బర్రిగొడ్డు అరిచిన శబ్దం కాదు - అది.....అది - సురేష్ ఏడుపు. నేను లేచాను. మంజుల లేచింది. కంగారుగా నాచేయి పట్టుకొని, "వద్దు - శారదా - వద్దు - తమ్ముడు" అన్నది. భయంతో ఆమె వణకుతోంది. సావిట్లోంచి అరుపులు ఇంకా ఎక్కువైనాయి. నేను ఆమెను వదిలించుకుని వెళ్ళాను.

సావిట్లో నేను చూసిన దృశ్యం - చొక్కాలేని సురేష్ - బెల్టుతో బాదుతున్న రామారావు. అతను ఏడుపు - ఇతను అరుపులు. సుగుణమ్మ అయినా పిల్లవాడిని కొట్టవద్దని భర్తకు అడ్డురావడం లేదు. ఆమే అరుస్తోంది. నేను కొత్త మనిషిని, పరాయిదాన్ని. సంసారం

గుట్టు నాకళ్ళ ఎదుట వడిపోయింది. భ్రష్టమైపోయిన కొడుకు కథ నాకు తెలిసిపోయింది.

అయినా, వాళ్ళు ఆగలేదు. మరో దెబ్బ, మరో దెబ్బ ఠాప్‌మని వేస్తున్నాడు. వాతలు తేలుతున్నాయి. నేను రాక్షసినైనాను. వెళ్ళి ఆయన చేయి వట్టుకున్నాను. ''ఏమిటండీ! ఏమిటి? ఆ అబ్బాయిని చంపేస్తారా?'' అన్నాను.

రామారావు అలసిపోయి కూలబడ్డాడు. నుగుణమ్మ నా వంక చాలా అసహ్యంగా చూసింది. సురేష్ సొమ్మసిల్లిపోయాడు. దెబ్బలు తిన్నాడేగాని పారిపోవడం లేదు. కుర్చీనానుకుని నిలబడ్డాడు. కొట్టు, ఇంకా కొట్టు, చంపేయి అన్నట్లుంది ఆ అబ్బాయి వైఖరి.

''చంపేస్తాం. వీడు - వీడు - డబ్బులు ఎత్తుకుపోయాడు. డబ్బులు ఇమ్మన్నావుగా ఇచ్చాం. అవి వానికి ఏం సరిపోతయి? దొంగతనం సేసిండు. బంగారం ఎత్తుకపోయాడు. తాగి వట్నంలో వడిపోయిండు. సైకిలు, రేడియో, ఉంగరం, గడియారం అన్నీ అమ్ముకున్నాడు. అప్పులు చేస్తడు. నూదులు తీసుకుంటున్నడు. మందు తింటున్నడు. ఆడి దోస్తులందరికీ తినిబెడతడు. ఇసుంటోడు సస్తే ఏంది? నాకు కొడుకు లేడను కొంట. స్కూల్ కాడ చాయ్ తాగిండని ఒక్క దెబ్బ ఏసినందుకు ఎంత కత నదివినవు? ఇవ్పుడేం నదువుతవో నదువు'' అన్నది నుగుణమ్మ. ఊడిపోయిన ఆమె సిగ, చెమటలు కారిపోతున్న ఒళ్ళు, చెరిగిపోతున్న బొట్టు, కింద పెద్దవైపోయి ఆక్రోశాన్ని నిప్పులుగా కురుస్తున్న ఆమె కళ్ళు!

> ఎటు చూసినా మూసుకున్న సొరంగం చీకటిలో దిక్కు తెలియక సురేష్ వెళ్ళిపోయాడు.

ఏం జవాబివ్వను? సురేష్ దగ్గరగా వెళ్ళాను. పొడుగైపోయినాడు. బలమైన ఆ ఒళ్ళు వంగిపోతోంది. ''బాబూ'' అని భుజం మీద చేయి వేశాను. నొప్పితో కదిలాడు. నావంక చూశాడు. 'హలో' అన్నాడు.

వద, మందు రాస్తాను అనాలనుకున్నాను.

ఎన్నాళ్ళు రాస్తాను? నేనెవరినని ఆ తల్లి, తండ్రి ఇస్తున్న దండనని ఖండిస్తాను? ఏమీ చెప్పలేక, తడి బట్టతో అయినా అతని ఒళ్ళు తుడవలేక, మంజులైనా కదలనందుకు బాధ కూడా వడలేక చూస్తున్నాను.

ఇది కుటుంబ వ్యవహారం. నేను తలదూర్చి లాభం లేదు. అయినా, మనసొప్పక మంజుల చేయి వట్టుకున్నాను. ''మందు రాసి, తడిబట్టతో తుడు'' అన్నాను చాలా అస్పష్టంగా. గదిలోకి వెళ్ళి, నేలమీద గోడనానుకుని కూలబడ్డాను.

సురేష్ ఒక రోగి. ప్రేమతో, ఓర్పుతో దారిలోకి తీసుకురావాలని చెప్పాలి. ఇటువంటివారికి ఆస్పత్రులున్నాయనీ, అతను చెడ్డవాడు కాదు, బలహీనుడనీ వారికి అర్థమయ్యేట్లు చెప్పాలి. నా శక్తి చాలుతుందా? తెల్లవారగానే మరో ఊరు చక్కాపోయేదాన్ని, నేను ఏం చేస్తాను? నేనెంత, నా విజ్ఞానం ఎంత, నా ఆర్థికస్థితి ఏమిటి? పట్నవాసంలో నా వలుకుబడి ఏముంది? ఏదో చెయ్యవచ్చు అని తెలుసుగానీ - విషపురుగు కాటు రోజూ తింటున్న ఆ అబ్బాయిని రక్షించగలనా నేను?

గడియారం రెండు, మూడు గంటలు కొట్టింది. సావిట్లో ఏమీ అలికిడి లేదు. మంజుల వచ్చి మంచం మీద వడుకుని ఏడుస్తోంది.

మాగన్నుగా నిద్ర వట్టింది. గొడవ, గోల, అరుపులు, ఏడుపులు - లేచాను. సావిట్లో ఎవరో వరుగెడుతున్నారు. నేనూ అటే వెళ్ళాను. బావి దగ్గర - బావి లోపల - నిచ్చెనలు, తాళ్ళు. సురేష్ పైకి వచ్చాడు.

అందరూ చెప్పేస్తున్నారు అనలు జరిగిందేమిటో. ఏదో మందు మింగాడు. మందుసీసా అక్కడే ఉంది. బావిలో దూకాడు. ఈత వచ్చినాగానీ ఈదలేదు. బతికేందుకు వీలున్నాగానీ బతకలేదు.

లోకంలో ఉండి ఏం చేయాలో తెలియక, ఎటుచూసినా మూసుకున్న సొరంగం చీకటిలో దిక్కు తడుముకోవడం రాక - బహుశా నా బోటి మనిషి అతనికి జరిగిన ఘోర అవమానాన్ని చూసినందుకు సహించలేక తనకు తోచిన మార్గంలో వెళ్ళిపోయాడు.

నుగుణమ్మ పిచ్చిది - ఇంకా పిచ్చిదైంది. 'నా కొడుకో! నా బిడ్డో!' అని ఏడుస్తోంది.

నా వృత్తి సంఘసేవ. కానీ, ఆమె నన్ను తిడుతుందని భయపడుతున్నాను. ■


